క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. సత్యవేడు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అంతకుముందు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రతిభ సాధించిన విద్యార్థులు

నాగలాపురం: అండర్–14 త్రోబాల్ రాష్ట్ర పోటీల్లో మండల పరిధిలోని కారణి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నంద్యాలలో జరిగిన ఈ పోటీల్లో కావ్య, విజయలక్ష్మి, శివాణి ప్రతిభ చాటి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యాయవాదుల బైక్ ర్యాలీ

శ్రీకాళహస్తి: భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ గురువారం న్యాయవాదులు నిరసన తెలిపారు. పట్టణ వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూహక్కు చట్టం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు.

గణితంపై ఆసక్తిని పెంచాలి



సత్యవేడు: మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: విద్యార్థులకు గణితంపై ఆసక్తి కలిగేలా బోధన సాగాలని ఎంఈఓ కె.రవి తెలిపారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, సత్యవేడు మండలాల గణిత ఉపాధ్యాయులకు సీఆర్‌సీ సమావేశం జరిగింది. ఎంఈఓ సీఆర్‌సీ సమావేశాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపొందించాలని సూచించారు. గ్రూప్ యాక్టివిటీ, రోల్‌ప్లే, టీఎల్‌ఎం తయారీ, కేస్ స్టడీస్‌పై ఉపాధ్యాయులు అవగాహన పొంది విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధించాలన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : తొట్టంబేడు మండలం పొయ్య గ్రామానికి చెందిన మునిప్రసాద్ కుటుంబానికి గురువారం అధికారులు వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందించారు. కైలు రైతు మునిప్రసాద్ ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఆయన ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బంది వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు చేతులమీదుగా మృతుని భార్యకు రూ.10వేలు అందించారు.

అమర ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



శస్త్ర చికిత్స విజయవంతం చేసిన డాక్టర్ శివకృష్ణ

రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని అమర ఆస్పత్రిలో ఓ వృద్ధుడికి గుండె సంబంధిత అరుదైన ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు ఆస్పత్రి కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ శివకృష్ణ తెలిపారు. మదనపల్లెకు చెందిన వెంకటరమణ(81) కొన్ని నెలల నుంచి గుండె వాపు సమస్యతో అనేక ఆస్పత్రుల్లో చూపించుకున్నా నయం కాకపోవడంతో అమరలో చేరాడు. డాక్టర్ శివకృష్ణ వైద్య పరీక్షలు చేసి, ఆయనకు శస్త్ర చికిత్స చేసి సీఆర్‌టీ పరికరం అమర్చారు. దీంతో ఈఎఫ్ పర్సెంటేజ్ మెరుగుపడడంతో ఆయనను డిశ్చార్జ్ చేశారు. వారి కటుంబ సభ్యులు అమర ఆస్పత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

స్కూటరిస్ట్‌కు గాయాలు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ గాయపడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. శ్రీకాళహస్తికి చెందిన సుబ్రమణ్యం (36) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతున్నాడు. మేర్లపాక వద్ద ముందు వెళుతున్న లారీని అధికమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రసవత్తరంగా ఆడుదాం...ఆంధ్ర



సత్యవేడు: పెద్ద ఈటిపాకంలో కబడ్డీ పోటీలు

సత్యవేడు: ఆడుదాం–ఆంధ్ర క్రీడాపోటీలు గురువారం నియోజకవర్గంలో రసవత్తరంగా సాగా యి. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా కారులు క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వేదికగా మారాయి. మండలంలోని పెద్దఈటిపాకం సచివాలయ పరిధిలో 'ఆడుదాం– ఆంధ్ర' క్రీడలను సర్పంచ్‌లు రూబెన్, గోవిందస్వామితో కలసి ఎంపీటీసీ సభ్యురాలు సెల్వి ప్రారంభించారు. పెద్ద ఈటిపాకం, రాజగోపాలపురం, పీవీపురం పంచాయతీల్లో బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో 34 టీమ్‌లు పాల్గొన్నాయి. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కె.రవి, పోటీలను పర్యవేక్షించారు.

సత్తా చాటేందుకు చక్కటి అవకాశం

బుచ్చినాయుడుకండ్రిగ: కొత్తపాళెం గ్రామంలోని క్రీడా మైదానంలో సర్పంచ్ సుబ్బరత్నమ్మ క్రీడా కిట్లను పంపిణీ చేసి, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ కారులకు ఈ పోటీలు సరైన వేదిక అని తెలిపారు. గ్రామ కార్యదర్శి స్వర్ణమంజుల, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిప్రసాద్, సంజీవయ్య, తదితరులు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగలో క్రీడా కిట్ల పంపిణీ

హోరా హోరీగా..

నాగలాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం కబడ్డీ పోటీలను సర్పంచ్ చిన్నదొరై ప్రారంభించారు. క్రీడారులు విజయం సాధించేందుకు హోరాహోరీగా తలపడ్డారు. ఎంపీపీ సింధూ శ్యామ్, పీడీ బాబు, సచివాలయ కన్వీనర్ ముత్తు, దేశప్పన్, నాయకులు ధనరాజ్, మహేష్, ఉదయ కుమార్ పాల్గొన్నారు.

కేవీబీపురం మండలంలో..

కేవీబీపురం: మండలంలోని బైరాజుకండ్రిగ క్రీడా ప్రాంగణంలో గురువారం క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. స్థానిక సర్పంచ్‌లు పెంచెలయ్య, విజయ్ క్రీడా కారులను పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభించారు. మొదట కోవనూరు,కర్లపూడి జట్లు తలపడగా కర్లపూడి జట్టు విజయం సాధించింది. తరువాత బ్రాహ్మణపల్లె, గురుకులకండ్రిగ జట్ల మధ్య జరిగిన పోటీల్లో గురుకులకండ్రిగ జట్టు విన్నర్‌గా నిలిచి, కర్లపూడి జట్టుతో మూడో మ్యాచ్‌లో ఓటమిపాలైంది. మ్యాచ్‌లను తిలకించేందుకు ఆరు గ్రామాల యువకులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున రావడంతో సందడి నెలకొంది.

క్రీడలతో శారీరక ధారుడ్యం

వరదయ్యపాళెం: క్రీడలతో శారీరక ధారుడ్యం లభిస్తుందని ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు అన్నారు. ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సంతవేలూరు సచివాలయం ప్రాంగణంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. పలువురు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సర్పంచులు నన్నయ్య, చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి హబీబ్, పీఈటీ మనోహర్ పాల్గొన్నారు.



కేవీబీపురం : క్రికెట్‌లో తలపడుతున్న క్రీడాకారులు



వరదయ్యపాళెం : వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



నాగలాపురం : కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతు భరోసా కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సుమన్, దివాకర్‌రెడ్డి

నారాయణవనం: రాష్ట్రంలో రైతుల కష్టాలను గుర్తించి వారికి మేలు చేకూరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ అన్నారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన గురువారం నారాయణవనం–3 సచివాలయ పరిధిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. తొలుత శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమన్‌కుమార్, దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సాగు పెట్టుబడి, యంత్ర పరికరాలు అందిస్తూ సలహాలు, సూచనలకు ఆర్బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తలనాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. సాగును ప్రోత్సహిస్తూ, పంటకు గిట్టుబాటు ధరను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతులను ఆదుకుంటూ ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. ఇలాంటి మేలు కొనసాగాలంటే రాష్ట్రానికి మళ్లీ సీఎంగా జగనన్నే కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ ప్రమీల, పీఆర్ డీఈ మధుసూదన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు ఏకాంబరం, గురుస్వామి, చిన్నదొరై, సారకాయలు, మణిరెడ్డి, మోహన్, శంకరయ్య, మనోహర్ పాల్గొన్నారు.

వైభవంగా గొబ్బి దేవత ఉత్సవం





ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి, పురవీధుల్లో ఊరేగుతున్న గొబ్బెమ్మ దేవత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవత ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ పురవీధి ఉత్సవం జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం గురుదక్షిణామూర్తికి ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బాగుపడిన రోడ్లు



నాడు: ఎల్లంపల్లి వద్ద ధ్వంసమైన తారురోడ్డు



నేడు: రోడ్డుకు మరమ్మతులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : మిచాంగ్ తుపాన్ భారీ వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణరోడ్లకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిధులు వెచ్చించి బాగు చేయించారు. పల్లంపేట నుంచి శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరు వైపు వెళ్లే తారురోడ్డు ఎల్లంపల్లె సమీపంలో పెద్ద గుంతలుగా మారాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అదేవిధంగా చింతలపాళెం నుంచి శ్రీకాళహస్తి మండలం బీవీపురం వైపు వెళ్లే రోడ్డు సైతం ఎస్ఎస్ కెనాల్‌కు సమీపంలో కోసుకుపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. ఈ విషయాన్ని ఈ మార్గంలోని ప్రజలు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి తన సొంత నిధులు వెచ్చించి ట్రాక్టర్లతో గ్రావెల్ తోలించి జేసీబీల సాయంతో చదును చేయించారు. దీంతో ఈ మార్గంలోని ఎల్లంపల్లి, వాగవేడు, మేలచ్చూరు, కుంటిపూడి, బీవీపురం, కొత్తూరు, గొల్లపల్లె గ్రామాలకు రాకపోకలకు సుగమం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.



నాడు : బీవీపురం మార్గంలో దుస్థితిలో రోడ్డు



నేడు : గ్రావెల్‌తో రోడ్డు చదును పనులు

అయోధ్య రామయ్య అక్షింతల రాక



అక్షింతలు అందుకుంటున్న భక్తులు

కేవీబీపురం: అయోధ్య రామయ్య పవిత్ర అంక్షింతలు గురువారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. రామయ్య సేవాదళ్ మండల కన్వీనర్ యుగంధర్ మండలంలోని సుమారు 1,600 కుటుంబాలకు అక్షింతలను అందించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 24న అయోధ్యలో రామయ్య ఆలయం ప్రారంభం కానుందని తెలిపారు. సేవదళ్ మెంబర్లు పాల్గొన్నారు.

గణిత క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సత్యవేడు: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం గణిత క్యాలెండర్ 2024ను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ మ్యాథమేటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో ముద్రించిన ఈ క్యాలెండర్‌ను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఎంఈఓ రవి, బుచ్చినాయుడు కండ్రిగ, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15 మంది బైండోవర్

బుచ్చినాయుడుకండ్రిగ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వీఎస్‌పురం, కారణి మిట్ట గ్రామాలకు చెందిన 15 మందిని గురువారం తహసీల్దారు భార్గవి ఎదుట పోలీసులు హాజరు పర్చారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలప్పుడు గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పనివేళల్లో వెసులుబాటు కల్పించండి

నాగలాపురం: తమకు సమయపాలన వెసులుబాటు కల్పించాలని డివిజనల్ ఇంజినీర్ చంద్ర నాయక్‌కు సచివాలయ ఎనర్జటిక్ సహాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహించే విధంగా చూడాలని కోరారు. రజని, చెంగయ్య, చరణ్, రాంకి, క్రాంతి, శరవణ, మహేష్, భాగ్యరాజ్, జయకుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణ సమష్టి బాధ్యత

శ్రీకాళహస్తి: కుష్టు వ్యాధి నివారణ సమష్టి బాధ్యత అని పట్టణంలోని సాలెపేట పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభిం చారు. ఆమె మాట్లాడుతూ జనవరి 12 వరకు ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి పట్టణ ప్రజలు సహకరించాలని జిల్లా ప్రోగ్రాం మెడికల్ అధికారి జోబు కోరారు. వ్యాధి ఎలా వస్తుందో వివరించారు. ఏఎన్‌ఎంఎస్‌లు, ఆశా వర్కులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

మాతృభాషపై పఠనాసక్తిని పెంచాలి

వరదయ్యపాళెం: విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేస్తూ మాతృభాష తెలుగుపై పఠనాసక్తిని పెంచాలని మండల విద్యాశాఖ అధికారి గన్నయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య పర్యవేక్షణలో బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల తెలుగు ఉపాధ్యాయులుకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాలానుగుణంగా నూతన పద్ధతులను ఉపయోగించి విద్యాబోధన ఎలా ఎలా చేయాలి, భాషా సమర్థ్యాలు సాధన, పది పరీక్ష ప్రశ్న పత్రాలపై అవగాహన వంటి వా టిపై విషయ నిపుణులు యువశ్రీ మురళి తెలియజేశారు.



సూచనలు ఇస్తున్న ఎంఈఓ గన్నయ్య

వైఎస్సార్ సీపీతోనే నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి

శ్రీకాళహస్తి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతనే నాయీ బ్రాహ్మణులు అభ్యున్నతి సాధ్యమైందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీటీడీ బోర్డు మెంబర్ సిద్ధవటం యానదయ్య, ప్రచార కార్యదర్శి పరమశివం, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సురేంద్ర స్పష్టం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాయీ బ్రాహ్మణులను మీడియా సాక్షిగా 'మీ తోకలు కత్తిరిస్తా.. గుడి మెట్లు ఎక్కనివ్వను..మీ అంతు చూస్తా.. తొమ్మిది సంవత్సరాలు పాలించాను.. ఏమనుకున్నారో' అని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. ఆదరణ పథకం కింద డీడీలు కట్టించుకుని పనిముట్లు ఇవ్వకుండా వేధించారన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయయని తెలిపారు.

పాఠశాలకు రూ 1.3 లక్షల విరాళం



హెచ్‌ఎంకు చెక్కు అందజేస్తున్న దాతలు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి స్థానిక మేరువ కుటుంబ సభ్యులు రూ.1.30 లక్షల చెక్కును గురువారం హెచ్‌ఎం మనోహరికి అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు మేరువ జయప్రకాశ్, హరి ప్రసాద్, నిరంజన్, దిలీప్, వినోద్, లోహిత, నరసింహులు, లక్ష్మి ఆర్థిక సాయాన్ని అందజేయడం అభినందనీయమని కొనియాడారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

శ్రీకాళహస్తి: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు తలెత్తుతాయని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రగతి సంస్థ, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సమావేశం జరిగింది. రమణ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. బాలల హక్కులను హరించడమే కాకుండా సమాజ పురోగతి, అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. బాలల రక్షణ అధికారి శివశంకర్, 1వ పట్టణ సీఐ అంజు యాదవ్, సీఐ మల్లికార్జున్, సీడీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ అధికారులు, పలు శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రగతి కోఆర్డినేటర్ తులసీరాం, యానాది సంఘం అధ్యక్షుడు కోట య్య, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో ట్రాఫిక్ జామ్



ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

ఏర్పేడు: మండల కేంద్రంలోని వెంకటగిరి కూడలిలో భారీ వాహనాల రాకతో గురువారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 6.30 గంటలకు వెంకటగిరి రోడ్డు నుంచి ఆరులేన్ల రోడ్డు పనులకు మట్టిని తరలించే లారీలు ఏర్పేడులోని కూడలి మీదుగా తిరుపతి వైపునకు రావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం జరిగింది. రాత్రి 6.30 గంటల నుంచి 7.45 గంటల వరకు రోడ్డుకు ఇరువైపుల 4 కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు రోడ్డుపై బారులు తీరాయి. ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న ఓ ప్రైవేట్ అంబులెన్స్ కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుంది. వాహదారులు సైతం అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడం గమనార్హం. సమాచారం అందడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని క్రమబద్ధీకరించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసుల నిర్వహణాలోపంతో తరచూ ఇలా జరుగుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిండు కుండలు

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెరువులన్నీ నిండాయి. భూగర్భ నీటిమట్టం పెరగడంతో వ్యవసాయ బావులు సైతం నిండు కుండల్లా ఉన్నాయి. మండలంలో అధికారిక లెక్కల ప్రకారం 314 వ్యవసాయ బావులున్నాయి. నీరు సంవృద్ధిగా ఉండడంతో రబీ పంటల సాగుకు ఇబ్బంది లేదని రైతులు అంటున్నారు. బావుల కింద సాగు పనులు ముమ్మరమయ్యాయి. బావుల్లోని నీటిని మోటార్లు సహాయంతో తోడుతున్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ

